www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 04 | అక్టోబర్ | 2025
పేజీలు : 8

## పండుగలు ఐక్యమత్యానికి వేదికగా నిలవాలి




# పదును, పరపతి కోల్పోతున్న పదవులు..!




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒకప్పుడు గ్రామ సర్పంచ్ పదవి అంటే ఎంతో విలువ ఉండేది. సర్పంచ్ మాటకు పదునెక్కువ. దాదాపు గ్రామంలో సర్పంచ్ మాటకు ఎదురు ఉండేది కాదు. కుటుంబ వ్యవహారాలు, గట్ల పంచాయతీలు, ఆస్తుల తగాదాలు ఇలా ఏమైనా సర్పంచుల సమక్షంలోనే జరిగేవి. ఉత్సవాల నిర్వ హణ, ఇతరత్రా సామూహిక కార్యక్రమాల నిర్వహణ మొత్తం సర్పంచ్ చేతుల మీదుగానే జరిగేవి. అధికార యంత్రాంగం సైతం సర్పంచ్ మాటకే తొలి ప్రాధాన్య తనిచ్చేవారు. గ్రామానికి సంబంధించి ప్రభుత్వ పరంగా ఏ నిర్ణయం జరగాలన్న సర్పంచ్ ద్వారానే జరి గేది. సర్పంచ్ సిరఫారసుకు చాలా విలువ ఉండేది. ఎప్పుడో తప్పితే ఆయన సిఫారసు చేశాడంటే పని జరి గిపోయేది. పోలీసులతో అప్పట్లో గ్రామాల్లో పనులు తక్కువగా ఉండేవి. ఎవరైనా పోలీసులను ఆశ్రయిం చినా చివరకు పోలీసులు సైతం ఆ ఘటనకు సంబం ధించి సర్పంచ్ అభిప్రాయాన్ని తీసుకునే వారు అంత పదునైనా పదవికి ఇప్పుడు వన్నె తగ్గింది. పదవి పదును తగ్గింది. గ్రామాల్లోని చిల్లర రాజకీయాలు రాజకీయ పార్టీ నేతల ప్రత్యక్ష, పరోక్ష పెత్తనాలు సర్పంచ్ పదవి వన్నె తగ్గేందుకు కారణమయ్యాయి. ఇప్పుడు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతల మాటలు చెల్లుబాటు

మిగతా 2లో..

## గ్రామాల్లోనూ ముదిరిన చిల్లర రాజకీయాలు



## సూర్యానగర్‌లో చేతబడి కలకలం..!



- ఓ కుటుంబం, ముగ్గురు యువకులపై క్షుద్రపూజలు
- దబ్బడానికి ఫోటోలు, నిమ్మకాయ, బొమ్మపెట్టి చెట్టుకొట్టిన వైనం
- లండన్‌లో ఉన్న యువకుల ఫోటోలు పెట్టడంతో పలు అనుమానాలు
- కుటుంబ తగాదాలతో ఇంటి దొంగలు చేసిన పనిగా ఆరోపణలు
- సాంకేతికయుగంలోనూ రాజ్యమేలుతున్న మూఢనమ్మకాలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపా లిటీ పరిధిలోని తాళ్లేసితండలో గల సూర్యనగర్‌లో దస రపండగపూట చేతబడి కలకలం రేపింది. దబ్బడానికి ఫోటోలు, నిమ్మకాయ, బొమ్మపెట్టి గుర్తుతెలీని వ్యక్తులు చెట్టుకొట్టారు. దీనిని ఆ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు వీడియో తీసి స్థానిక వాట్సప్‌గ్రూపులో పెట్ట డంతో వైరల్ అయ్యింది. అవి వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన ఓ కుటుంబంతో పాటు ముగ్గురు యువకులవి కావడంతో వారంత అక్కడికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా కాలనీవాసులు, బాధితులు భయాందోళ నకు గురయ్యారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ క్షుద్రపూజలకు సంబంధించిన సామాగ్రిని స్టేషన్‌కు తరలించారు. ఇటువంటివి నమ్మవద్దని సూచించారు.

### తెలిసిన వ్యక్తులపనేనా..?

ఓకే కుటుంబానికి చెందిన వారితో పాటు ముగ్గురు యువకుల ఫోటోలు సేకరించి ఇంత పకడ్బంధీగా చేసిన తీరు బాగా తెలిసిన వారి పనిగానే కనిపిస్తుంది. ఎందుకంటే ఆ ప్రాంతం నిత్యం ప్రజలు సంచరిస్తునే ఉంటారు. అంతేకాకుండా ప్రధానరహదారికి కూత వేటుదూరంలో ఉంది. కాబట్టి తెలీని వారు అంత ధైర్యంగా అక్కడకి వచ్చి ఇటువంటి దుశ్చరలు చేసే అవ కాశం లేదు. సదరు బాధితులుగా పేర్కొంటున్న వారికి ఈ వ్యవహారాన్ని జరిపించిన వారికి సన్నిహిత సంబం ధాలున్నట్లుగా వారి మాటల ద్వారా తెలిసింది. కుటుంబ కక్షల నేపథ్యంలోనే తమ దగ్గరి బంధువులే ఫోటోలు సేకరించి చేసి ఉంటారనే అనుమానం వ్యక్తం చేయడం

మిగతా 2లో..

## జాతి గౌరవాన్ని నిలబెట్టాలి

-స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు మంత్రి తుమ్మల శంకుస్థాపన

2 లో



## లొంగిపోయిన 103 మంది మావోయిస్టులు



**ప్రజాపక్షం/భద్రాచలం :** మావోయిస్టు పార్టీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో ఆ పార్టీకి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. తాజాగా మావోయిస్టు పార్టీకి చెందిన 103 మంది లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పోలీసుల ఎదుట ఈ లొంగు బాటు జరిగింది. ఇంత పెద్ద మొత్తంలో మావోయిస్టులు ఒకే సారి లొంగిపోవడం ఇదే ప్రథమం. లొంగిపోయిన ప్రతీ ఒక్కరికీ తక్షణ

మిగతా 2లో..

# పదును, పరపతి కోల్పోతున్న పదవులు..!

**(మొదటిపేజీ తరువాయి)**

అవుతున్నాయి. నేరుగా మండల అధికారులతో అధికార పార్టీ నాయకులే మాట్లాడుతూ పనులను చక్కబెడుతున్నారు. చాలా గ్రామాల్లో ఒక మాటలో చెప్పాలంటే మెజార్టీ గ్రామాల్లో సర్పంచులు నామ మాత్రంగా మారిపోయారు. ఇక రిజర్వేషన్లు ఉన్న చోట పరిస్థితి మరి ఘోరం. కేవలం కుర్చీలో కూర్చోవడానికి తప్ప పనికిరాని పరిస్థితి. గ్రామానికి ఎన్ని నిధులు వస్తున్నాయి, ఎక్కడెక్కడ పని చేస్తున్నాం, ఏఏ ప్రతిపాదనలు పంపుతున్నాం అనే విషయాలు చాలా మంది సర్పంచులకు తెలియడం లేదంటే అతిశయోక్తి కాదు. గ్రామంలో అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపలేని స్థితిలో కూడా కొంత మంది సర్పంచులు ఉన్నారు. సర్పంచులకు అంతగా రాజకీయ అవగాహన, సామాజిక అవగాహన లేకపోవడంతో కొంత మంది అధికారులు గ్రామాల్లో పెత్తనం చెలాయిస్తున్నారు. సర్పంచులను డమ్మీలుగా చేసే ప్రయత్నం చేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా పల్లె రాజకీయ వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో డబ్బు ప్రమేయం పెరిగిపోయింది. వార్డు మెంబర్ నుంచి సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఇలా ఎవరైనా ఎన్నికల్లో నిలబడితే ఓటుకు ఇంత అని ఇవ్వకుండా ఓట్లు అడిగే పరిస్థితి లేదు. ఎప్పుడైతే ధన ప్రభావం పెరిగిందో ఓటర్లకు పదవి బాధ్యతల్లో ఉన్న వ్యక్తులకు మధ్య దూరం కూడా పెరుగుతూ వచ్చింది. చిల్లర రాజకీయాలు, పెరిగిన ధన ప్రభావం, స్థానిక



సంస్థలపై రాజకీయ పెత్తనం, కొన్ని చోట్ల అధికారుల తీరు వెరసి పల్లె పదవులకు వన్నె తగ్గింది. వారి మాటకు పదును తగ్గిపోయింది. సర్పంచ్ ఎన్నికలు మూహూర్తం ఖరారైన వేళ ఇప్పుడు గత అనుభవాలను పలువురు నెమరువేసుకుంటున్నారు. సర్పంచ్ అంటే ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉంటుందనే దానిపైన చర్చలు సాగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లోనూ రంగంలోకి దిగి ఆర్థికంగా ఎంతో కొంత ఖర్చు చేసి మళ్లీ ఎన్నికల బరిలో నిలవవాలన్న ఔత్సాహికుల సంఖ్య మాత్రం తగ్గక పోవడం కొసమెరుపు.

# జాతి గౌరవాన్ని నిలబెట్టాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జాతి గౌరవాన్ని నిలబెడుతూ సమాజాభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్వర్ణ భారతి కమ్మ వారి కళ్యాణ మండపంలో జరిగిన కమ్మ మహాజన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.అనంతరం సంఘం అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎంతో మంది పెద్దల సహకారంతో కమ్మ మహాజన సంఘం ఏర్పడిందన్నారు. ఇది సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుందని దానిని కొనసాగించాలన్నారు. పరుచూరి వెంకటేశ్వరరావు, స్వతంత్ర లక్ష్మి దంపతులు స్కిల్ సెంటర్ నిర్మాణానికి రూ. 40 లక్షలు విరాళం అందించడం అభినందనీయమన్నారు. అట్టి నిధులను పారదర్శకంగా వినియోగించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఇటువంటి దాతల సహకారం వల్ల సమాజం ముందుకు సాగుతుందని వారి త్యాగం భవిష్యత్ తరాలకు ఆదర్శమన్నారు. దాత పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను సంపాదించిన దానిలో కొంత ఇలాంటి కార్యక్రమాలకు వినియోగించడం నా ధర్మంగా భావిస్తున్నానని తెలిపారు. సమాజానికి తిరిగి ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అనంతరం ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా సన్మానించి అభినం



దించారు. కఠినమైన పోటీ పరీక్షల్లో రాణించి రాష్ట్రానికి గౌరవం తీసుకు వచ్చిన అభ్యర్థుల కృషిని ప్రశంసించారు. అదేవిధంగా దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి తాతా మధుసూదన్, టిజివో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్ఎ కొండబాల కోటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, సంఘం కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, మేదరమెట్ల స్వరూపరాణి, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, డా॥ పోతినేని భుమేశ్వరరావు, కోలేటి నవీన్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యానగర్‌లో చేతబడి కలకలం..!





**(మొదటిపేజీ తరువాయి)**

ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.

**లండన్‌లోని ముగ్గురు యువకులపై చేయడంతో అనుమానం**

ఓ కుటుంబంపై క్షుద్ర పూజలు చేసిన వారిపై వారు ఓ వ్యక్తిపై అనుమానం పడ్డారు. ఖచ్చితంగా ఇది అతను చేసిన పనే అనే బావనకు వచ్చారు. అందులో లండన్‌కు చెందిన ముగ్గురు యువకులపై చేయడంతో అనుమాన కోనం మారింది. వారిపై చేయాల్సిన అవసరం ఎవరికుంటుందనే ఆలోచన రేకెత్తించింది. ఈ క్రమంలోనే వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన సదరు బాధిత యువకులు ఓ యువతి లండన్‌లో ఉన్నట్లు యువకుల కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. లండన్‌లో ఏర్పడిన ఓ వివాదం నేపథ్యంలోనే ఈ పని చేసి ఉంటారనే పలు అనుమానాలకు దారితీసింది. కాగా ఓ కుటుంబ సభ్యులపై జరిపిన క్షుద్ర పూజ కుటుంబ తగాదాలతోనే సొంతవారనేది తెలిసింది. ఈ ఘటనతో బాధితులు తీవ్ర ఆందోళన, ఆవేదనకు గురయ్యారు.

**ఇంకా మూఢనమ్మకాలు...**

ఇంతటి సాంకేతిక యుగంలోను మూడనమ్మకాలు రాజ్యమేలుతున్నాయనటానికి ఈ ఘటనను ఉదాహరణగా చెప్పవచ్చు. ఓ కుటుంబంతో పాటు ఎక్కడో దూరంగా లండన్‌లో ఉన్న యువకులపై క్షుద్రపూజలు చేయడం పిచ్చిపనిగానే కనిపిస్తుంది. వారిని భయపెట్టేందుకే ఇలా చేశారన్నది స్పష్టమవుతుంది. ఈ పని చేసి సుమారు పదిరోజులైనట్టుగా అక్కడి పరిస్థిని గమనిస్తే తెలుస్తుంది. అంటే ఈ మూడనమ్మకం విషయం వాట్సప్ వీడియో వైరల్ అయ్యేంత వరకు బాధితులకు తెలీదు. అంటే అప్పటి వరకు వారికి ఎలాంటి భయాందోళనకు గురికాలేదు. కానీ ఈ విషయం తెలీడంతో రకరకాల ఆందోళనలు, అనుమానాలు తెరపైకి వచ్చాయి. కాబట్టి ఇక్కడ నమ్మకం బలపడంతో మూడనమ్మకం అనేది తేటతెల్లమయ్యింది.

# పండుగలు ఐక్యమత్యానికి వేదికగా నిలవాలి : కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పండుగలు ఐఖ్యమత్యానికి వేదికలుగా నిలవాలని, అనాధిగా వస్తున్న ఆచారాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని పలు ఏరియాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగలను ఐఖ్యతతో ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకోవడం ద్వారా ప్రజల్లో సమానత్వం ఏర్పడుతుందని చెప్పారు. ఉత్సవాల్లో పేదలను కూడా భాగస్వామ్యులను చేయడం ద్వారా వారిలో కూడా సంతోష వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రజాస్వామ్య భారతదేశంలో కుల మతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలు జరుపుకోవడం మంచిదన్నారు. ప్రజలుభక్తి మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా రాగద్వేషాలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి అబ్దుల్ రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, ఎస్‌కే ఫహీమ్, జిల్లాసమితి సభ్యులు వంద వెంకట్, మునిగడప వెంకన్న, రమణమూర్తి, ఖయ్యూం, కమల్, మధు, తూముల శ్రీను, మండలరాజు, పాటి మోహన్, మాజీ కౌన్సిలర్లు యూసుఫ్, ధర్మరాజు, మునిగడప పద్మ, భూక్యా శ్రీనివాస్, మాచర్ల శ్రీను, బోయిన విజయ్, సత్యనారాయణ చారి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన 103 మంది మావోయిస్టులు

**(మొదటిపేజీ తరువాయి)**

పునరావాసం క్రింద రూ.50 వేలను ఆ రాష్ట్ర పోలీసులు అందజేశారు. లొంగిపోయిన వారిలో 22 మంది మహిళలతో సహా క్రియాశీలక సభ్యులు కూడా ఉన్నారు.. 49 మందిపై సుమారు రూ.1 కోటి రివార్డు కూడా ఉంది. మావోయిస్టు భావాజాలం నచ్చక, బూజుపట్టిన సిద్ధాంతాలను వదిలేసి జనజీవన స్రంవతిలో కలవాలనే ఉద్దేశ్యంతో వీరంతా మూకుమ్మడిగా లొంగిపోయినట్లు బీజాపూర్ ఎస్‌పి జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఇప్పటికే మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగులుతోంది. వందలాది మంది మృతి చెందుతుండగా అందులో కేంద్రకమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర, జిల్లా, లోకల్ కమిటీల సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు అడవులను జల్లెడపడుతున్న క్రమంలో పార్టీలో కీలక నేతలు సైతం ప్రాణాలు దక్కించుకునేందుకు లొంగుబాటు పడుతున్నారు. ఇదిలా ఉండగా మావోయిస్టు అగ్రనేత, పోలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తాజాగా డిజిపి శివధర్ రెడ్డి ముందు తన అనుచరులతో పాటు లొంగిపోయినట్లుగా వార్తలు చెక్కర్లు కొడుతున్నాయి. కాగా గత కొద్దిరోజుల క్రితం మల్లోజుల వేణుగోపాల్ తుపాకులు వదిలేస్తామంటూ లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ దానిని తప్పికొడుతూ ఆ లేఖ సారాంశం కేవలం మల్లోజుల వ్యక్తిగత అభిప్రాయమే తప్ప పార్టీ నిర్ణయం కాదంటూనే విప్లవ ద్రోహిగా అభివర్ణించారు. తన వద్ద ఉన్న ఆయుధాలను సైతం అప్పగించాలని లేదంటే గెరిల్లా వ్యూహాలతో తెచ్చుకుంటామని సూటిగా ప్రకటించారు. ఇదిలా ఉండగా మావోయిస్టు కేంద్రప్రధాన కార్యదర్శిగా తిప్పరి తిరుపతిని ఎంపిక చేయడం వల్ల మల్లోజుల అక్కసుతో పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారిపోయాడని, పోలీసుల అదుపులో ఉండే పోలీసుల వ్యూహాల నడుమే ఆయన లేఖలను విడుదల చేశారనే వార్తలు కూడా వచ్చాయి. ఆయనతో పాటు తక్కెల్లపల్లి వాసుదేవరావు, కందగట్ల యాదగిరి అలియాస్ భాస్కర్, వణిత వంటి నేతలతో పాటు మరో ఆరుగురు కూడా లొంగిపోయిన వారిలో ఉన్నట్లు సమాచారం. నూతన డిజిపిగా విధుల్లో చేరిన శివధర్ రెడ్డి లొంగిపోయిన మల్లోజులతో పాటు మిగత ఆవారిని త్వరలో మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందనే వాదన బలంగా వినవస్తోంది.

# లెనిన్ శ్రీనివాస్‌కు అరుదైన ఆహ్వానం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం సాహిత్య సారధి లెనిన్ శ్రీనివాస్‌కు అరుదైన ఆహ్వానం లభించింది. విజయవాడలో ఈ ఏడాది నవంబర్ 22, 23 తేదీలలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మల్లెతీగ సాహిత్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సాహిత్య సభలకు నిర్వహకులు, వికాస వేదిక సాహిత్య సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్‌ను ఆహ్వానించింది. లెనిన్ శ్రీనివాస్ వర్ధమాన బాల కవులను ప్రోత్సహిస్తూ ఎందరో కవులకు దన్నుగా నిలుస్తున్నారు. సాహిత్యాభిలాష వైపు పలువురిని ఆహ్వానిస్తూ ప్రోత్సహించే లెనిన్ శ్రీనివాస్‌కు ఈ ఆహ్వానం దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో సాధనాల వెంకటస్వామి నాయుడు, బుక్కా సత్యనారాయణ, కాంతేశ్వరరావు, శంకర్‌రెడ్డి, వెంకటకృష్ణ, భారతి శ్రీనివాస్, శైలజ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యునిగా వద్దిరాజు రవిచంద్ర



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నియామకపు ప్రక్రియలో భాగంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మరోసారి పెట్రోలియం సహజవాయువు స్టాండింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. లోక్‌సభ డిప్యూటీ కార్యదర్శి సుజయ్‌కుమార్ శుక్రవారం ఈ నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. మొత్తం 31 మంది సభ్యులు ఉండే ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది రాజ్యసభ నుంచి 10 మంది ఎంపిలు ప్రాతినిథ్యం వహిస్తారు. ప్రతి రెండేళ్లకొకసారి నియామకమయ్యే ఈ పదవికి సంబంధించి వద్దిరాజు వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా సునీల్ దత్తాత్రే తత్కరే కొత్తగా ఎన్నికయ్యారు.

# పుట్టిన గడ్డ రుణం తీర్చుకున్న దాసరి కుటుంబం

**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
**-పైసలు ప్రజల కోసం ఖర్చు పెట్టే గొప్ప మనస్సు కొందరికే ఉంటుంది**
**-ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి**





**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడం అందరికీ సాధ్యం కాదని, దాసరి వీరారెడ్డి మొదలుకొని, వారి కుమారుడు దాసరి వెంకట్రామిరెడ్డి (చిట్టి నాయన) వారి కుమారుడు దాసరి మధుమోహన్ రెడ్డిలు పుట్టిన ఊరికి, తమ తోటి పెరిగిన ప్రజలకి అభివృద్ధి ఫలాలను అందించి నేడు దాసరి కుటుంబం పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటున్నారని, దాసరి మధుమోహన్ రెడ్డి లాంటి కొడుకు ఉంటే ఆ తల్లిదండ్రుల జన్మ ధన్యమైనట్లేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దాసరి మదుమోహన్ రెడ్డి గంగారం గ్రామంలో సుమారు రూ.6 కోట్లతో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ భవన్, యాదవ కమ్యూనిటీ హాల్, జలగం నగర్ ఆర్చ్, కళ్యాణ మండపం, బస్ స్టేషన్, సీ,సీ కెమెరాలు, కామాక్షి అమ్మవారికి ఆర్.సి.సి భవనం, చర్చీ తదితరాలు నిర్మించగా దసరా పర్వదినం సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయిదయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ చేతుల మీదగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ దాసరి మధు మోహన్ రెడ్డి గ్రామానికి చేస్తున్న సేవలు తనను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అభినంధించారు. తన తాత, తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మధుమోహన్ రెడ్డి గ్రామంలోని అన్ని కులాల వారికి మంచి చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ డబ్బు సంపాదించడం గొప్ప కాదని,ప్రజల కోసం ఖర్చు పెట్టడం గొప్పన్నారు. దాసరి మధుమోహన్ రెడ్డి లాంటి సేవకులు గ్రామానికి ఒక్కరు ఉన్న ఆ గ్రామ రూపురేఖలు మారిపోతాయన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు,సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి, మాజీ కౌన్సిలర్ పద్మ జ్యోతి, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, చలసాని సాంబశివరావు, దొడ్డా శ్రీను, కమల్ పాషా, గంగారం గ్రామ నాయకులు కోలగట్ల చెన్నారావు, కావేటి అప్పారావు, రాచమళ్ళ రాము, జల్లిపల్లి వాసు, బత్తుల నారాయణ, మారేష్, యేసు,ముత్యాలరావు, జవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# అమరుల స్ఫూర్తితోనే శత జయంతోత్సవాలు

**-పిచ్చయ్య వర్థంతి సభలో జమ్ముల జితేందర్‌రెడ్డి**




**ప్రజాపక్షం/ తల్లాడ :** అమరవీరుల త్యాగాల స్ఫూర్తితోనే శత జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్నామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పినపాక గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లమోతు పిచ్చయ్య 38వ వర్థంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. పిచ్చయ్య స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి నూరేళ్లు నిండుతున్న సమయంలో ఎంతో త్యాగమూర్తుల పోరాట స్ఫూర్తి ఉందన్నారు. అందులో తెలంగాణ సాయుధ పోరాటయోధుడు నల్లమోతు పిచ్చయ్య చరిత్ర అజరామరమన్నారు. పాత మధిర తాలూకాలో బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన పోరాడారన్నారు. తిండి, గూడు, బట్ట ఉండాలని అని చెప్పి ఆహర్నిశలు శ్రమించి పేదల గుండెల్లో పిచ్చయ్య చిరస్థాయిగా నిలిచారన్నారు. అటువంటి ధన్యజీవులు భారత కమ్యూనిస్టు పార్టీలో వేలాది మంది ఉన్నారన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శత వసంతాల ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహించుకుంటున్నామని వాటి విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం నల్లమోతు పిచ్చయ్య కుటుంబ సభ్యులకు శత వసంతాల ముగింపు సంబురాల ఆహ్వానాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, తోట రామాంజనేయులు, జిల్లా నాయకులు శ్రవణ్‌కుమార్, నిమ్మటూరి రామకృష్ణ, యేబు, నల్లమోతు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**-స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం**




**ప్రజాపక్షం/ కొణిజర్ల :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, దొండపాటి రమేష్ లు తెలిపారు. మండలంలో అత్యధిక స్థానాల్లో సిపిఐ పోటీ చేయనున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం కొణిజర్ల మండల కేంద్రంలోని దొండపాటి భవన్‌లో పాపకంటి సుదర్శన్ అధ్యక్షతన సిపిఐ మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిపిఐ శ్రేణులు సిద్దంగా ఉన్నట్లు వారు తెలిపారు. పార్టీ బలంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో, ఎంపిటిసి స్థానాల్లో సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. జెడ్పిటిసి స్థానానికి కూడా సిపిఐ పోటీ చేస్తుందన్నారు. పోటీ చేసేందుకు కూడా పార్టీలో ఆశావాహులు ఎక్కువగా ఉన్నారని పార్టీ నిర్ణయం మేరకు అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మిత్రపక్షంగా ఉండే పార్టీలతో పొత్తులు పెట్టుకునే అవకాశం కూడా ఉందన్నారు. గతంలో కొన్ని పార్టీలో పొత్తులు పెట్టుకుని అనైతిక పొత్తులకు పాల్పడ్డారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టుల సత్తా ఏమిటో అందరికీ తెలుసన్నారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, సహాయ కార్యదర్శి స్వర్ణ రమేష్, మణిగ కోటేశ్వరరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పివి రావు, వెంపటి పరశురాములు, కంపసాటి వెంకన్న, పిట్టల రాంబాబు, ఎం. చిన్న వెంకటి, అచ్చన శ్రీనివాసరావు, యాసా వెంకటేశ్వరరావు, పిడియాల వెంకటి, పెనుగొండ వెంకటి, గ్రామశాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కడారి శైలజకు నివాళి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పెనుబల్లి పంచాయతీరాజ్ జేఈ కడారి రమేష్ సతీమణి కడారి శైలజ మృతిచెందగా, విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ సత్తుపల్లి పట్టణంలోని రమేష్ నివాసానికి చేరుకొని శైలజ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. దయానంద్ వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా తదితరులున్నారు.

## గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన సుస్మితకు సన్మానం



**ప్రజాపక్షం/తల్లాడ :** గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన గోపిశెట్టి సుస్మితను తల్లాడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం గ్రూప్1 ఉద్యోగం సాధించిన గోపిశెట్టి సుస్మితకు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సుస్మితతో పాటు ఆమె తల్లి దండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షులు నంబూరి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ గుర్రం శేషగిరిరావు మాట్లాడుతూ పట్టుదలతో, క్రమశిక్షణతో చదివి గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన సుస్మితను అభినందించారు. తల్లిదండ్రులతో పాటు పుట్టి పెరిగిన ఊరుకు మంచి పేరు సంపాదించి నేటి యువతకు సుస్మిత ఆదర్శ ప్రాయంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు జవ్వాజి నర్సింహారావు, దారా విష్ణుమోహన్‌రావు, వేమిశెట్టి వెంకటేశ్వరరావు, జవ్వాజి నగేష్, అనుమోలు సర్వేశ్వరరావు, సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పేదింట మెరిసిన విద్యా కుసుమం

**-ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన రూపశ్రీ**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** లక్ష్య సాధనకు పేదరికం అడ్డు కాదని నిరూపించింది నిడిగొండ రూపశ్రీ. ప్రతిభ ఉంటే అవకాశాలు అవే వస్తాయన్న దానికి నిదర్శనంగా నిలిచింది. మండల పరిధిలోని ఈర్లపుడి గ్రామానికి చెందిన నిడిగొండ వెంకటేశ్వరు వసంత దంపతుల కుమార్తె నిడిగొండ రూపశ్రీ వైద్య విద్య ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబర్చి ఎంబిబిఎస్‌లో సీటు సాధించింది. తండ్రి వెంకటేశ్వర్లు బార్బర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పేదరికంలో మగ్గుతున్న తమ కుమార్తెను ఉన్నత చదువులు చదివించాలని కలలుకన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చేందుకు చిన్నతనం నుంచే రూపశ్రీ కష్టపడి చదివింది.మైనార్టీ గురుకుల కళాశాలలో విద్యను అభ్యసించి వైద్య విద్య ప్రవేశ పరీక్షలో 9878వ ర్యాంకు సాధించి వరంగల్ ప్రతిమ మెడికల్ కళాశాలలో సీటు దక్కించుకుంది. ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన రూపశ్రీని, వారి కుటుంబ సభ్యులను గ్రామస్తులు, బంధుమిత్రులు, అడ్వకేట్ దరావత్ ప్రసాద్ అభినందనలు తెలిపారు. రూపశ్రీ విజయం ఎంతో మంది నిరుపేదలకు ఆదర్శమని కొనియాడారు. మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవలు అందించడమే తన లక్ష్యమని రూపశ్రీ తెలిపింది.

## సిపిఐ సానుభూతిపరురాలు సీతమ్మ మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని తాళ్లేసితండాలోని సూర్యనగర్‌కు చెందిన భాగం సీతమ్మ(80) అనారోగ్యంతో శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు భాగం రంగరావు అక్కడి సిపిఐశాఖ సభ్యుడిగా క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ మండల సమితి సభ్యుడు దండి రంగారావు, శాఖ సెక్రటరీ కృష్ణ, ఉప్పల్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

**-మరో యువకుడికి తీవ్ర గాయాలు..**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండల కేంద్రంలోని బిసి కాలనీ మసీద్ రోడ్డు యు టర్న్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పడిగా సాయి (25)అనే యువకుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. పెనుబల్లి మండలం విఎం బంజర్ గ్రామానికి చెందిన పడిగా సాయి దసరా (గురువారం) సందర్భంగా తన మిత్రులతో కలిసి సరదాగా గడిపి స్నేహితుడి కొత్త బైక్ తో ట్రైల్ డ్రైవింగ్ చేద్దామని మరో స్నేహితుడు సిద్ధార్థ కలిసి కొత్తగూడెం జాతీయ రహదారిపై వెళుతుండగా బైక్ అదుపు తప్పి పెనుబల్లి మసీదు వద్ద యు టర్న్ తీసుకుంటున్న టిప్పర్ లారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాయి తలకు బలమైన గాయం అయింది. హుటాహుటిన 108 వాహనంలో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికత్స అనంతరం ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందా డు. మరో యువకుడు జల్లరాపు సిద్ధార్థ కు కూడా తలకు గాయమవడంతో ఖమ్మం తరలిం చారు. ఈ ఘటనపై విఎం బంజర్ ఎస్ ఐ కె. వెంకటేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## గుండెపోటుతో మహిళ మృతి

**-పండుగ పూట కుటుంబంలో విషాదం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గుండెపోటుతో మహిళ మృతి చెందిన సంఘటన సత్తుపల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కృషి స్కూల్ రోడ్డు నందు నివాసముంటున్న పెనుబల్లి పంచాయతీరాజ్. జే ఈ. కడారి రమేష్ సతీమణి కడారి శైలజ (45) తీవ్ర అస్వస్థతకు గురికావడంతో విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. మృతురాలికి భర్త రమేష్, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కడారీ శైలజా మృతితో పండుగ పూట కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ

**-సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి**



**ప్రజాపక్షం/ఏన్కూరు :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏన్కూర్ మండలంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) అభ్యర్థులు పోటీ చేస్తారని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఏన్కూరు లో ముఖ్య కార్యకర్తల సమావేశం భానోత్ రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో జడ్పీటీసీ తో పాటు బలమున్న అన్ని ఎంపీటీసీ స్థానాల్లో సీపీఐ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు. కలిసొచ్చే పార్టీలతో పొత్తు అవగాహనతో ముందుకెళ్తామన్నారు. సీపీఐ పార్టీ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) దేశంలో ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా డిసెంబర్ నెలలో ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో జరుగుతాయని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు పాల్గొంటున్నారని దాని జయప్రదానికి ఈ నెల 5న ఖమ్మంలోని సన్నాహక సమావేశం యస్ ర్ గార్డెన్ లో జరుగుతుందని అన్నారు. మండలంలో కౌన్సిల్, కార్యవర్గ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సమితి సబ్యులు తెప్పల సత్యం, అమరనేని వీరభద్రమ్, మండల కార్యవర్గ సభ్యులు బోగినబోయిన నాగేశ్వరావు, నల్లపటి నర్సింహ రావు, బనోత్ లక్ పతి, ఎల్లయ్య, తాళ్లూరి రమణ, మళ్ళెంపాటి కోటేశ్వర రావు, సొలం నాగరాజు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా దసరా సంబురాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రంలో దసరా సంబరాలు గురు, శుక్రవారాలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయం, భక్తరామదాసు ధ్యాన మందిరం, శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయాల నుంచి ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా ప్రదర్శన నిర్వహించారు. కోలాటాలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. జమ్మి చెట్టు కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవం ను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, వల్లాల రాధాకృష్ణ. రాయపూడి నవీన్, బొడ్డు బొందయ్య, మైశా శంకర్, కడియాల నరేష్, వివిధ దేవాలయాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఆశనిపాతంగా మారిన టెట్ తీర్పు



**ప్రజాపక్షం/మధిర :** ఇటీవల సుప్రీం కోర్టు ఉపాధ్యాయులందరూ సర్వీస్ కొనసాగాలన్నా, పదోన్నతి పొందలన్నా టెట్ తప్పసరిగా ఉత్తీర్ణులు కావాలని తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు ఆశనిపాతంగా మారిందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మధిర డివిజన్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో మధిర డివిజనల్ కార్యాలయ కన్వీనర్ వినోద్‌రావు, మధిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.నాగరాజు, వీరయ్య, ఉపాధ్యక్షులు ఇబ్రహీం, కార్యదర్శులు లాల్ అహ్మద్, బి.రమేష్‌బాబు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన రేచర్ల సత్యం



**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ని మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావుని మర్యాదపూర్వకంగా కలిసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యం వారికి పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరంశెట్టి సీతారాములు, షేక్ జాని, నాగేశ్వరరావు, మాదినేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విద్యుత్ షాక్ తో వ్యక్తి కి తీవ్ర గాయాలైయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా కు చెందిన తేజావత్ ధన్ సింగ్ రహదారి వెంట చెట్టు కొమ్మలు కొస్తుండుగా, విద్యుత్ వైర్ తెగింది. వైర్ ను విద్యుత్ తీగలకు లైన్ కలుపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు షాక్ తగిలి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

## కాంగ్రెస్ దగ్గర డబ్బుంటే.. బిఆర్ఎస్ వెంట ప్రజలు ఉన్నారు..

**-బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా**
**-ఏ మొహంతో ఎన్నికల్లో ఓట్లు అడుగుతారు..**
**-మాజీ ఎమ్మెల్యే మెచ్చా**



**ప్రజాపక్షం/దమ్మపేటః** కాంగ్రెస్ దగ్గర డబ్బుంటే.. బీఆర్ఎస్ వెంట ప్రజలు ఉన్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శుక్రవారం దమ్మపేట మండల స్థాయి నాయకుల సమావేశం మండల పార్టీ అధ్యక్షులు దొడ్డా రమేష్ ఆధ్వర్యంలో పార్కలగండిలోని కొబ్బరి తోటలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రేగాతో పాటు అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని వీడి పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పట్వారీగూడెం పంచాయతీకి చెందిన బుల్లా నాగరాజు, వాడే వసంత్, కొమరం వెంకటేశ్వరరావు, కుర్సం మారప్ప, కాసిని బాలాజీ, బందెల నాగరాజు, గణేష్ పాడు నుంచి ఎర్రగొర్ల సాయి, దురదపాడు నుంచి కుర్సం కవిత తదితరులు రేగా, మెచ్చా సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ కాంగ్రెస్ దగ్గర డబ్బుంటే బీఆర్ఎస్ వెంట ప్రజలు ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజల సొమ్మును వేరే రాష్ట్రాలకు పంచుతున్నారు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలంటే కాంగ్రెస్ పార్టీ వారు దాడులు చేయిస్తున్నారు అన్నారు. గెలుపు బీఆర్ఎస్ అభ్యర్థులదే అన్నారు. మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ...మోసం చెయ్యడమే కాంగ్రెస్ నైజం అని అన్నారు. మొహం పెట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికలకు ఓట్లు అడుగుతారు? అన్నారు. 100 రోజుల్లో అమలు చేస్తామన్న హామీల సంగతి ఏంటి? అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జున రావు, నియోజకవర్గ నాయకులు సోయం వీరభద్రం, మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి, పార్టీ రైతు సంఘం మండల అధ్యక్షులు అంకత ఉమ మహేశ్వరావు, దారా యుగందర్, జలగం వాసు, నాయకపోడు సంఘం నాయకులు రావుల శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసుబాబు, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షులు సత్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రావూరి వీరయ్య, మండల నాయకులు దేవరపల్లి బుజ్జియ, సోడెం గంగరాజు, రెడ్డిమాళ్ళ నాగయ్య, తాటి పోతురాజు, తుమ్మల లక్ష్మణ రావు, బద్ధరావు, చీకటి రామయ్య, బేతిని నాగేశ్వరరావు, చీపు వెంకటేశ్వరావు, అబ్దుల్ జిన్న, మాజీ ఎంపీటీసీ కాసిన శ్రీనివాసరావు, వల్లెపు నాగేశ్వరరావు, పాకనాటి శ్రీనివాసరావు, కోర్స వెంకటేశ్వరావు, పర్వతనేని ప్రభాకరావు, ఉకే వెంకటేశ్వరావు, నారం రాజు, పండు, లాలు,సోయం రాజబాబు, మద్దెల పుల్లారావు, పాస్యం ప్రసాద్, లాలు, మాదాసు సుదర్శనరావు, గుత్తి శ్రీనివాసరావు, రూప రాంబాబు, దండి లక్ష్మీ నారాయణ, మిచ్చేర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## భట్టివిక్రమార్కను కలిసిన సిపిఐ నాయకత్వం



**ప్రజాపక్షం/ మధిర :** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎంపిటిసిలు గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పొత్తు విషయమై శుక్రవారం మధిర క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను సిపిఐ నాయకత్వం కలిసి తాము పోటీ చేసే స్థానాల జాబితాను భట్టివిక్రమార్కకు అందించింది. జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి నాయకత్వంలో మధిర నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపిటిసి, జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్‌ల పోటీ చేసే స్థానాలపై భట్టికి వివరించారు. ఈ సందర్భంగా జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాము ఇచ్చిన జాబితా విషయమై భట్టివిక్రమార్క సానుకూలంగా స్పందించారని, కాంగ్రెస్, సిపిఐ గత అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పనిచేశామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పనిచేస్తామని భట్టికి నాయకత్వానికి తెలిపినట్లు ఆయన వివరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ శ్రేణులకు కూడా దిశానిర్దేశం చేయనున్నట్లు ఆయన తెలిపారని జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఏపూరి రవీంద్రబాబు, బెజవాడ రవిబాబు, ఎం.ఎ.రహీం, పావులూరి మల్లికార్జున్‌రావు, కూచిపూడి రవీంద్రబాబు, చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, రాసాల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్‌కి నిధులు కేటాయించాలని భట్టికి వినతి



**ప్రజాపక్షం/మధిర :** ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కను మధిర పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు కోరారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు వనమా వేణుగోపాలరావు నివాసానికి బ్రేక్‌ఫాస్ట్‌కు వెళ్లిన డిప్యూటీసిఎం భట్టివిక్రమార్క బ్రేక్ ఫాస్ట్ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మధిర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చారుగుండ్ల నర్సింహారావు ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని విన్నవించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ నిధులు కేటాయించటం ద్వారా పేద, మధ్య తరగతికి చెందిన ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. దీనికి స్పందించిన భట్టివిక్రమార్క సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైరా సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరావు, నూకల శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యంబాబు, కొల్లా రాంబాబు, మధిర ఆర్యవైశ్య ప్రముఖులు మిరియాల వెంకటరమణగుప్తా, రంగా హన్మంతరావు, దేవిశెట్టి రంగారావు, మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కాజా చక్రధర్‌రావు, కోశాధికారి చెడే రామకోటేశ్వర రావు, మధిర టౌన్ అధ్యక్షులు వనమా కిరణ్ తదితరులు ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి : ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటి అత్యధిక స్థానాలు సాధించే విధంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధి వినాయకపురంలోని చిలకలగుడ్డి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలంగా ఉండాలని, పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేసిన వారికి సరైన గుర్తింపు ఉంటుందన్నారు. జెడ్పిటిసి, ఎంపిటిసి గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు విధివిధానాలపై పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**-మంత్రి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన హరిబాబు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలలో కాంగ్రెస్ విజయం సాధించాలని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలం లోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన మోటాపురం ఎత్తిపోతుల పథకం చైర్మన్ దండా హరిబాబు తన అనుచరులతో గురువారం మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మంత్రి కండువా కప్పి సాదారంగా అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమపథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో విజయదుందుబి మోగించాలనిద సూచించారు. నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, దండా పుల్లయ్య, ఎర్రబోయిన నర్సయ్య, నల్లాని మల్లిఖార్జునరావు, కొమ్మినేని పుల్లమ్మ, పాకనాటి కన్నారెడ్డి, కొమ్మినేని విజయ్యాబు, కొచ్చేర్ల శ్రీనివాసరావు, వీరెల్లి నాగరాజు, దండా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సిపిఐ అన్ని స్థానాల్లో పోటీ

**ప్రజాపక్షం/పినపాక:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పినపాక మండలం లోని అన్ని 9ఎంపీటీసీ, పంచాయితీ పరిధిలోని వార్డులకు, 21 సర్పంచ్‌లకు సిపిఐ పోటీలలో నిలబడుతుందని, దీని కొరకు క్యాడర్ సిద్ధంగా ఉండాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బయ్యారం ఎక్స్ రోడ్ పినపాక సిపిఐ కార్యాలయంలో మండల, కార్యవర్గ సభ్యులు సమావేశం మన్నెం ఐలయ్య అధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అన్ని స్థానాల్లో పోటీలో నిలబడుతుందని, దీనికి సిపిఐ క్యాడర్ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలు ఎన్నికలలో పొత్తులు ఉన్న లేకున్నా పోటీలో సిపిఐ నిలుస్తుందని, గతంలో సిపిఐ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన విషయంలో అందరికి తెలుసని, అధికారం ఉన్నా లేకున్నా ప్రజల సమస్యలపై నిత్యం పోరాటం కొనసాగించిన సిపిఐనీ ప్రజలు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.



సిపిఐ క్యాడర్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో సిపిఐ పినపాక మండల కార్యదర్శి పద్మనాభ రాజు, జిల్లా సమితి సభ్యులు గడ్డం మనోరచారి, పత్తిపాటి నాగేశ్వరరావు, ఏఐటియుసి పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్, తత్రపల్లి వెంకన్న, ఐలయ్య, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గంగారావు ప్రత్యేక పూజలు





**ప్రజాపక్షం/వైరాః** వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావును పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి సన్మానించారు. సన్మానించిన వారిలో వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావును సన్మానించిన టిపిసిసి జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కరీం పాషా, ఓబిసి జిల్లా సెక్రటరీ బొబ్బల వెంకట్ యాదవ్, సుజాతనగర్ మండల అధ్యక్షులు కసనబోయిన లక్ష్మణ్, యువజన నాయకులు తేజావత్ శ్రీనివాస్, వాడపల్లి రామారావు, మూడుముంతల గోపి తదితరులు పాల్గొన్నారు. మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న మార్కెట్ వైరా మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద వైరా మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావుకు మాజీ కౌన్సిలర్ బత్తుల గీత, బత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారిని మార్కెట్ చైర్మన్ గంగారావు దర్శించకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరు సీతారాములు, తిరుపతి శ్రీను, బండారు నాగరాజు, దేవళ్ళ రాము, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

**మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు**

**ప్రజాపక్షం/మణుగూరుః** ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లలో దళితులకు తీరని అన్యాయం జరిగిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన శుక్రవారం మణుగూరు మాల మహానాడు మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 233 ఎంపీటీసీ స్థానాలకు గాను కేవలం 5 స్థానాలను ఎస్సీలకు కేటాయించడం రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నట్టుగా అనిపిస్తుందన్నారు. జడ్పిటిసి విషయానికి వస్తే జిల్లాలో కేవలం ఒకే ఒక జడ్పిటిసి స్థానాన్ని ఎస్సీ లకు కేటాయించడం దారుణం అన్నారు. మణుగూరు మండలం ఎస్సీ జనాభా 25 వేలకు పైగా ఉందని రొటేషన్ సిస్టంలో జెడ్పిటీసీ స్థానానికి మళ్లీ ఎస్టీ ని కేటాయించారని, రొటేషన్ సిస్టంలో ఎస్సీ కి వస్తుందని ఆశలు పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్లు శోచనీయంగా ఉన్నాయని, దీనిని మాల మహానాడు తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ పరిశీలించి అవసరమైతే ఎంపీటీసీ, జడ్పిటిసి రిజర్వేషన్లు సంహరించి జనాభా ఎక్కువగా ఉన్న వారికి రిజర్వేషన్ కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలోమాల మహానాడు మండల గౌరవ అధ్యక్షులు మద్దెల భద్రయ్య, అధ్యక్ష కార్యదర్శులు వేర్పుల నరేష్, బూర్గుల సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేర్పుల సురేష్, ఉపాధ్యక్షులు బూర్గుల సంజీవరావు, ముల్క నరేష్, సబ్బతి ఏసురత్నం, సహాయ కార్యదర్శి వేమూరి రవి, ప్రచార కార్యదర్శి ఉల్లోజు బాబి, బూర్గుల వెంకటరత్నం, వేర్పుల శంకర్, దాసరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు హెల్పింగ్ హ్యాండ్స్ వారి ఆధ్వర్యంలో బావి కూనవరం ప్రాంతానికి చెందిన వనచర్ల శ్రీనివాస్ కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న విషయం తెలుసుకుని శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. టిఫిన్ బండి నడుపుతూ జీవనం సాగిస్తున్న నేపథ్యంలో కిడ్నీ సమస్య తో ఆసుపత్రి వైద్య ఖర్చులతో కుటుంబ పోషణ భారంగా మారిన విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు నవనీత్, సుధీర్ ఆధ్వర్యంలో కిడ్నీ బాధితుడికి 16,000 రూపాయలతో పాటు కూతురు హనీషా చదువు నిమిత్తం సైకిల్‌ను ఆంధ్రప్రభ ఆర్.సీ. ఇంచార్జి టివైజేఏ జిల్లా అధ్యక్షులు మార్తి శ్రీనివాస్ యాదవ్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సనపా భారత్ అమూల్ శ్రీనివాస్ , ఇల్లా కృష్ణ , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ తల్లి చీర వేలం పాట రూ 29100లకు కైవసం



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని గోరీలపాడుతండా గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నాడు శ్రీ కనక దుర్గ తల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత చీర వేలంపాటను గోరీలపాడు గ్రామానికి చెందిన బానోత్ సాయి రమాదేవి దంపతులు రూ 29100లకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంతో నిష్టతో ఉత్సాహభరితంగా దేవీనవరాత్రి ఉత్సవాలను గ్రామంలో ప్రజలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని గోరీలపాడు తండ గ్రామస్తులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలందరూ తమ పిల్లాపాపలను పాడిపంటలను చల్లగా చూడాలని దుర్గామాతను పూజించారు. ఈకార్యక్రమంలో బానోత్ బాసు నాయక్, బానోత్ జీవన్ నాయక్, బానోత్ చోటి నాయక్, బానోతు సుధీర్ నాయక్, గోపినాయక్, రామారావు, బాలాజీ, తేజవతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి లడ్డు పాట రూ 60 వేలు

**పోటా పోటీగా లడ్డూను దక్కించుకున్న మహిళలు**



**ప్రజాపక్షం/ఏన్కూరు :** దేవి నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఊరేగింపు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏన్కూర్లో కోదండ రామాలయం ఆలయం వద్ద గత 11 రోజులుగా అమ్మవారిని వివిధ అలంకరణలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దగ్గర పెట్టిన లడ్డు పాటను నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులో కమిటీ దేవుడి పాటగా 10 వేలగా పెట్టారు. లడ్డు పాట ప్రధాన సెంటర్లో నిర్వహించగా లడ్డు పాటలో పురుషుల తోపాటు మహిళలు పోటీపడ్డారు. ఏన్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు కొప్పుల ప్రభావతి రెడ్డి, మాదినేని ఉషలు లడ్డు పాటలో పోటీపడి 60 వేలకు వారు దక్కించుకున్నారు. లడ్డు పాటలో పోటీపడి లడ్డు దక్కించుకున్న సందర్భంగా గ్రామ మహిళలు వారిని శాలువాతో సన్మానించారు. అమ్మవారి ఊరేగింపుగా గ్రామంలో నిర్వహించారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** స్థానిక సంస్థల జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి పట్టం గట్టాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి దంతెలబోర, ఎస్‌సి కాలని, సంగెం, నారాయణరావు పేట, నాగారం, రంగాపురం, నాగారం కాలని, జగన్నాధపురం, తోగ్గూడెం తదితర గ్రామాలలో పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదన్నారు. కావునా త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బరపటి వాసుదేవరావు, ఎర్రంశెట్టి ముత్తయ్య, నాయకులు జాలె జానకీరెడ్డి, ఎస్‌వికే. ఆచార్యులు, కొండం వెంకన్న, పైడిపల్లి మహేష్, బదర్ల జోషి, ఉండేటి శాంతి వర్ధన్, ధర్మసోత్ ఉపేందర్, బండి నాగరాజు, కొర్రయ్య, తెల్లం మల్లేష్, బానోత్ బాలాజీ, శ్రీలతరెడ్డి, బండపల్లి వెంకటనారాయణ, కొండం పుల్లయ్య, బాదర్ల నాగేశ్వరరావు, కోసర రాంమూర్తి, భూక్యా గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన



పారువేటలో పాల్గొన్న మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విజయ దశమిని పురస్కరించుకుని శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పారువేట కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. గురువారం స్తంభాద్రి లక్ష్మి నర్సింహాస్వామిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. జమ్మిబండ వద్ద నిర్వహించిన పారువేట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆలయ అర్చకులు, ఈవో ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా విజయ దశమిని జరుపుకుంటారని తెలిపారు. ఈ దసరా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పారువేట (ఆలయం) అభివృద్ధికి, సౌకర్యాల విస్తరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. పారువేట కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, ఏఎంసి ఛైర్‌పర్సన్ యరగర్ల హన్మంతరావు, వివిపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, సాధు రమేష్‌రెడ్డి, ఈవో జగన్‌మోహన్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత ముగింపు సభను పురస్కరించుకుని ఈనెల ఐదున ఖమ్మంలో జరిగే ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ నగర సమితి సమావేశం శుక్రవారం ఏనుగు గాంధీ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది.ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ముగింపు వేడుక డిసెంబర్ 26న జరగనుందని ఈ వేడుకకు సంబంధించి ఐదున జరిగే ఆహ్వాన సంఘ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి రాజా, అతిథులుగా బినయ్‌విశ్వం, కె నారాయణ, అజీజ్ పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి లతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఖమ్మం నగరం నుంచి పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు హాజరై ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని జానిమియా కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏరియా కార్యదర్శులు వరదా నర్సింహారావు, నూనె శశిధర్, జిల్లా సమితి సభ్యురాలు తాటి నిర్మల, ఎస్‌కె సైదా తదితరులు పాల్గొన్నారు.

# దామోదర్‌రెడ్డి మృతితో కామేపల్లి మండలంలో విషాదఛాయలు



**ప్రజాపక్షం/ ఖమ్మం/ కామేపల్లి :** మాజీ మంత్రి స్థానికుడైన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతితో కామేపల్లి మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి యవ్వన దశలోనే ఈ గ్రామాన్ని వదిలి తుంగతుర్తి వెళ్లిన ఇక్కడి అనుబంధాన్ని మాత్రం ఆయన కొనసాగించారు. ఐదుసార్లు ఎంఎల్‌ఏగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసిన దామోదర్‌రెడ్డి ఖమ్మం జిల్లాలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందారు. దామోదర్‌రెడ్డి సోదరుడు రాంరెడ్డి వెంకటరెడ్డి సుజాతనగర్ నుంచి పాలేరు నుంచి శాసన సభ్యునిగా ప్రాతినిథ్యం వహించడంతో పాటు మంత్రిగా కూడా పనిచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వీరికి అనుచర వర్గం ఉంది. దామోదర్ రెడ్డి మరణించారన్న వార్తతో పలువురు తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వందలాది మంది తుంగతుర్తిలోని దామోదర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు దామోదర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసిన దామోదర్ రెడ్డి మరణించడం తీరని లోటన్నారు.

# అక్రమంగా కలప తరలిస్తున్న లారీ, ట్రాక్టర్ పట్టివేత





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి నుండి నూజివీడుకు ఏపి 16 టిబ్ల్యూ 4455 గల వల్లిబోయిన అన్నపూర్ణకు చెందిన లారీలో ఎటువంటి అనుమతులు లేకుండా కాళని నరేంద్ర 20.4 సిఎంటి చేదు వేపను అక్రమంగా తరలిస్తుండగా బుగ్గపాడు వద్ద ఫారెస్ట్ రేంజ్ అధికారిని స్నేహలత ఆధ్వర్యంలో నైట్ పెట్రోలింగ్ చేస్తున్న అటవీ శాఖాధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, గోపాలపురం నుండి బుగ్గపాడుకు టిఎస్ 36 ఎం 8033 నంబర్ గల ట్రాక్టర్ ద్వారా వాసం నాగప్రసాద్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 20 టేకు దిమ్మెలను సైతం బుగ్గపాడులో పట్టుకుని రెండు వాహనాలను ఫారెస్ట్ డిపోకు తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా అర్ధరాత్రి వేళ 20 టేకు దిమ్మలను తరలిస్తున్న వాసం నాగప్రసాద్ పై 29,44 సెక్షన్ల కింద, చేదు వేపను తరలిస్తున్న కాళని నరేంద్రబాబుపై 28, 29, 37 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, అయితే పట్టుబడిన చేదు వేప ధర రూ.31,571 గా, టేకు దిమ్మెల ధర రూ.34 వేలు ఉన్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ధర కంటే రెండు లేదా మూడు రెట్లు జరిమానా పడనున్నట్లు తెలిపారు. రాత్రి, పగలు తేడా లేకుండా అటవీ సంపదను కాపాడేందుకు అటవీశాఖాధికారులు, సిబ్బంది ప్రాణాలకు తెగించి గస్తీ కాస్తున్నారని రేంజ్ అధికారిని స్నేహలత తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా కలప తరలించే వారు ఎవరైనా సరే పట్టుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. నైట్ పెట్రోలింగ్ లో ఫారెస్ట్ రేంజ్ అధికారిని స్నేహలత, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎంఆర్ పిచ్చేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్లు ఎస్ భాస్కర్, ఆర్ నాగరాజు, బీట్ ఆఫీసర్లు పి కృష్ణ, లత, సరిత తదితరులున్నారు.

# బతుకమ్మ ఉత్సవాల్లో అపశృతి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం కప్పల బంధం గ్రామంలో బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా నిమజ్జనం కార్యక్రమానికి పేర్చిన బతుకమ్మలు ట్రాక్టర్ రివర్స్ తీస్తుండగా సిమెంట్ శిలాఫలకం దిమ్మకు తగిలి దాని పక్కన నిలుచున్న వేముల శ్రీనివాసరావు (49) ప్రభుత్వ ఉపాధ్యాయుడు మీద కూలి పడటంతో మృతి చెందాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. అతని మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాలు నివాళులర్పించి కుటుంబానికి సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. పండగ పూట మృతి చెందడంతో గ్రామంలో ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల మండల పరిధిలోని ఉపాధ్యాయ సంఘాలు, పలు రాజకీయ పార్టీలు ప్రతినిధులు సంతాపాన్ని, సానుభూతిని తెలుపుతూ కుటుంబానికి ఓదార్పునిచ్చారు. రఘునాథ బంజర్ గ్రామంలో తెలుగు పండితుడిగా పనిచేస్తూ మండలంలోని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థుల మన్ననలు పొందారు.

# మహా అన్నదానం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని దేవీ నవరాత్రులు ఉత్సవాలు చివరి రోజున వీరబ్రహ్మేంద్ర ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, ప్రముఖులు, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పుల్లయ్య బంజర, కిష్టయ్య బంజర, లోకవరం, కల్లూరు, ఖాన్ ఖాన్ పేట పరిసర గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని మహిళ మృతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉరి వేసుకుని మహిళ మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన షేక్ సైదాబీ (35) స్థానిక కాకర్లపల్లి గ్రామ శివారులో పరుపుల ఫ్యాక్టరీలో వర్కర్ గా పనిచేస్తుండగా భర్త కిషోర్ ఆటో డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కిషోర్‌కి, చింతలపూడి మండలం సీతానగరం గ్రామానికి చెందిన యువతి సైదాబీకి 11 ఏళ్ల క్రితం వివాహం జరగ్గా వీరికి ఇద్దరు మగపిల్లలు. షేక్ సైదాబీ మృతికి సంబంధిత కారణాలు ఇంకా తెలియ రాలేదు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సత్తుపల్లి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని చెరువు కట్ట వద్ద గురువారం ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి ప్రమాదం కు గురైంది. ఖమ్మం కు చెందిన నాగరాజు అనే వ్యక్తి నేలకొండపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తుండుగా... స్థానిక చెరువు కట్ట వద్ద కు రాగానే బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైయ్యాయి. అదే సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ప్రమాదం ఘటనను చూసి క్షతగాత్రుడు కు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ కు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం పంపించారు.

# నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న వైరా మార్కెట్ ఛైర్మన్ గంగారావు



**ప్రజాపక్షం/వైరా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలురుపాడులో జరిగిన ఆరెబోయిన కృష్ణ ప్రసాద్, నాగలక్ష్మి, శ్రీరామ్ దంపతుల సరిత నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్న వైరా మార్కెట్ ఛైర్మన్ బోళ్ళ గంగారావు కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పమ్మి అశోక్, వీరంశెట్టి సీతా రాములు, ఇతరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడకే..



**-ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి**
**-కలిసికట్టుగా పనిచేసి**
**కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోండి**
**-రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్**

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులు, ప్రజలకందిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరిస్తే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడకే నన్నారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సత్తుపల్లి నియోజకవర్గం సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ మండలాల కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు హజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికులు గా పని చెయ్యాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి, సర్పంచ్ అభ్యర్థి భారీ మెజారిటీ తో గెలవాలని, గెలిపించాల్సిన బాధ్యత సైనికులుగా మీపై ఉందన్నారు. వర్గాలు, గ్రూపు లు లేకుండా గ్రామ కాంగ్రెస్ కమిటీ ద్వారా బలమైన గెలుపు గుర్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రతి పల్లెలో కాంగ్రెస్ జెండాలు ఎగరాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లు దోమ ఆనంద్ కుమార్, భాగం నీరజా చౌదరి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, సీనియర్ నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, చలగుళ్ళ కృష్ణయ్య, కమల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# శత వసంత సన్నాహక సమావేశానికి భారీగా తరలాలి



**- సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత జయంతి ఉత్సవముగింపు సభకు సంబంధించి ఈనెల 5న ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగే సన్నాహక సమావేశానికి కొత్తగూడెం నుండి 300 మంది తరలాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో శేషగిరి భవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడిత తాడిత ప్రజల మేలు కోసం సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం, కార్మికులు, కర్షకుల పక్షాన నిలబడి పోరాటాలు చేసిన సిపిఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో భారీ ముగింపు సభ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సమావేశానికి సంబంధించి ఆదివారం మధ్యాహ్నం 1 గం.కు శేషగిరి భవన్ వద్ద ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయకార్యదర్శి మునిగడప వెంకటేశ్వర్లు, నేరెళ్ల శ్రీనివాస్, కొల్లాపూర్ ధర్మరాజు, బోయిన విజయకుమార్, పోలోజు సత్యనారాయణ చారి, మర్రి గోపి, మండల రాజేశ్వర రావు, బత్తుల సురేష్, ఎర్రబెల్లి శంకర్, గట్టయ్య కొక్కిలిగడ్డ రామకృష్ణ, దాసరి అశోక్, మల్లేష్, భాస్కర్, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి అమ్మవారి దేవాలయానికి బంగారం, నగదు బహూకరణ

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు నందు మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం నందు డాక్టర్ ఓర్సు వెంకటేశ్వర్లు, తైవశ్రీ దంపతు లాధ్వర్యంలో సుమారు రెండు లక్షల 50వేలు విలువ చేసే బంగారు ఆభరణ అమ్మవారి దేవాలయానికి ఆలయ కమిటీ చైర్మన్ వేముల శివకృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని కోరుకున్న కోరికలు నెరవేరుతున్నాయని, దీనిలో భాగంగానే అమ్మవారికి రెండు లక్షల 50వేల విలువ చేసే బంగారం దాంతో పాటుగా కొంత నగదు గుడి నిర్వాహకులకు అందజేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం ఆలయ చైర్మన్ వేముల శివకృష్ణ, ఆలయ అర్చకులు రాజశేఖర్, రాము, లాలయ్య, ఆంజనేయులు, ఏడుకొండలు, తిరుపతి శ్రీనివాసరావు, ఓర్సు శ్రీను, తిరుపతిరావు, తురక చిన్న రాములు, పల్లపు రాంబాబు, శ్రీరాములు, రాజు కృష్ణ, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ జయంతి అయితే మాకేంటి..?




**-మా వ్యాపారం మాదే...ఆపేదెవరూ...**
**-ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్**
**-బూర్గంపాడు మండలంలో**
**విచ్చలవిడిగా మాంసం అమ్మకాలు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణలో పండట అంటేనే ముక్కా, సుక్కా అది లేకుండా ఎలా అంటున్నారు మండలంలోని కొందరు వ్యాపారులు. రాష్ట్రంలోనే అతిపెద్ద పండుగ అయిన దసరా నాడు ఇవి బంద్ చేయమంటే ఎలా అని క్వశ్చన్ చేస్తున్నారు. పొరపాటున దసరా నాడు గాంధీ జయంతి వచ్చింది. అయినంత మాత్రాన నాన్‌వెజ్ లేకుంటే మందు కొట్టకుండా కష్టమే అంటున్నారు. ఈనేపథ్యంలో మండల పరిధిలోని మోరంపల్లిబంజర్, లక్ష్మీ పురం, సారపాక, తదితర ప్రాంతాల్లో విచ్చల విడిగా మాంసం మందు విక్రయాలు జోరుగా సాగాయి. గాంధీ జయంతి సందర్భంగా మాంసం, మద్యం సేవించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ బూర్గంపాడు మండలంలో దానికి విరుద్ధంగా మాంసం అమ్మకాలు స్వేచ్ఛగా కొనసాగాయి. మండలంలో పలువురు పంచాయితీ ఈవోలు మాంసం దుకాణాల యాజమానులకు మాంసం విక్రయించొద్దని నోటీసులను సైతం జారీ చేశారు. అయితే మండలంలో ప్రధాన రహదారిపై ఉంటే పంచాయితీ పరిధిలోని మోరంపల్లిబంజర్, లక్ష్మీ పురం, సారపాక ఇలా పలు ప్రాంతాల్లో పట్టపగలే మాంసం విక్రయాలు జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం ప్రేక్షక పాత్రకే పరిమితం అయ్యారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఉద్యోగరీత్యా ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చేయాల్సిన అధికారులు వారి కళ్లముందే మాంసం విక్రయాలు జరుగుతున్న కనీసం పట్టించుకోకపోవడం వారి విధి నిర్వహణకు విరుద్ధంగా ప్రవర్తించడమే అనే పలువురు మండిపడుతున్నారు. కనీసం మండలంలో గాంధీ జయంతి రోజు తనిఖీలు చేయడానికి సైతం ఇష్టపడకపోవడం కొసమెరుపు..

# మళ్లీ వానలు

**- ముంచుకొస్తున్న శక్తి తుపాన్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆరేబియా తీరంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా మళ్లీ వానలు పడనున్నాయి. తాజాగా శుక్రవారం ఆకాశం మేఘావృతం కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్కడక్కడా తేలిక పాటి జల్లులు కురిసాయి. భారత వాతావరణ శాఖ చెప్పిన వివరాల ప్రకారం ఈ ఏడాది అరేబియా సముద్రంలో ఏర్పడే తొలితుపాను ఇదే నని దీని కారణంగా భారీ గాలుల వీయడంతో పాటు పెద్ద ఎత్తున వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. వాతావరణశాఖ నిపుణులు ఈ తుపానుకు శక్తిగా నామకరణం చేశారు. రాగల 48 గంటల్లో తుపాను ప్రభావం జిల్లాలో ఉండే అవకాశం ఉంది. భద్రాచలం వద్ద గోదావరి గత రెండు నెలలు నుండి తగ్గుతూ పెరుగుతూ దోబూచులాడుతోంది. ఈ తుపాను తీవ్ర ప్రభావం చూపితే మరో సారి గోదారికి అక్టోబర్‌లో కూడా వరదలు వచ్చే అవకాశం లేకపోలేదు.

# సాగర కాలువలో పడి విద్యార్థి గల్లంతు



**ప్రజాపక్షం/ఏన్కూరు :** సాగర కాలవలో పడి విద్యార్థి గల్లంతైన సంఘటన మండల పరిధిలోని తిమ్మరావుపేట గ్రామ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ గ్రామానికి చెందిన బొమ్మన బోయిన హర్షవర్ధన్ (15) తన అమ్మమ్మ గారి ఊరైన ఏన్కూరు మండలం రాజలింగాల గ్రామానికి దసరా సెలవులు నిమిత్తం వచ్చాడు. రాజలింగాల గ్రామంలోని బుజ్జి రామకోటయ్య, నాగమణి అమ్మమ్మ తాతయ్య ఇంటి నుండి శుక్రవారం మధ్యాహ్నం తన మేనమామ కొడుకైన సాయి తో కలిసి గ్రామ సమీపం లోని సాగర్ కాలువ వద్దకు వెళ్లారు. బహిర్భూమికి వెళ్ళిన వారిద్దరూ సాగర కాలువలు దిగారు. ఆ సమయంలో హర్షవర్ధన్ ప్రమాదవశాత్తు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. అనంతరం పక్కనే ఉన్న మిత్రుడు సాయి వచ్చి గ్రామంలో బంధువులకి, గ్రామస్తులకి తెలపడంతో అందరూ కలిసి కాలువ వద్దకు వెళ్లి చూడగా హర్షవర్ధన్ గల్లంతైనట్టు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఏన్కూరు ఎస్సై దివ్య తన సిబ్బందితో కలిసి కాలువ వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. సుజాతనగర్ గ్రామానికి చెందిన బొమ్మన బోయిన దినేష్, కల్పనకు సాయి తో పాటు చెల్లెలు ఉంది. సాగర్ కాలువ వద్ద తల్లిదండ్రులు బంధువులు విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

# రిజర్వేషన్ మార్చాలని ఆందోళన



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల పరిధిలోని ధర్మతండా గ్రామ పంచాయితీలో బీసీ సర్పంచ్ రిజర్వేషన్లపై ధర్మ తండా గ్రామ ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. శుక్రవారం ఈసందర్భంగా ధర్మ తండా పెద్దలు, యువకులు, మహిళలు మాట్లాడుతూ తండాలో మా రాజ్యం కావాలని 500 జనాభా కలిగిన తండాలను, గూడాలను ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా గత ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా ఒక్క ఓటు ఉన్న ఈ తండాలో అది కూడా స్థానికంగా లేకుండా వేరే ఊరల్లో(కేశవపురం గ్రామ పంచాయితీ)ఉన్నటువంటి బీసీ కులస్తులకు కేటాయించడంపై ధర్మతండ గ్రామ ఓటర్లు తీవ్రంగా ఖండిస్తూ దీనికి తక్షణమే రిజర్వేషన్లు మార్చి లంబాడీ బిడ్డలకు కేటాయించాలని, లేని యెడల హైకోర్టుకు వెళ్లి మా తండాలో మా రిజర్వేషన్ వచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. దీనిపై స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, అలాగే సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి న్యాయం చేయకపోతే ఎంపీటీసీ, జెడ్‌టిసి ఎన్నికలను బహిష్కరిస్తామని తండా వాసులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/వైరాః** తెలంగాణ రెవిన్యూశాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేచర్ల సత్యం, జిల్లా కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి నాగి, ఐలూరి మోహన్‌రెడ్డి, జాలాది రామకృష్ణ శాలువా కప్పి మంత్రిని సన్మానించారు.

# పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ





**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆకాంక్షించారు. విజయదశమి సందర్భంగా జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన ఆయుధపూజలో పాల్గొని ఆయుధాలకు పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయాన్ని చేకూర్చే విజయదశమిని పురస్కరించుకుని జిల్లాలో శాంతిభద్రతలు తలెత్తకుండా ప్రజలంతా సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలని, పోలీసుల గౌరవం, కిర్తిప్రతిష్టలు పెంపొందించాలని ఆకాంక్షించారు. శక్తి ప్రతికగా నిలిచిన దుర్గామాత సమక్షంలో ఆయుధాలకు పూజచేస్తే ప్రతి ఆయుధానికి ఎంతో శక్తికలిగిఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్, ఏఆర్ లు భోజా రామానుజం, కుమారస్వామి, స్పెషల్‌బ్రాంచి, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసిపిలు మహేష్, సుశీల్ సింగ్, రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్లు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, నాగుల్‌మీరా, సిఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# యథేచ్ఛగా మాంసాహారం విక్రయాలు




**- ప్రభుత్వ ఆదేశాలు సామాన్యులకు మాత్రమే**
**- నిబంధనలు పాటించని స్పైసీ హోటల్**
**- నామ మాత్రపు జరిమానా విధింపు..?**

**ప్రజాపక్షం/పాల్వంచ :** స్వాతంత్ర్య సమరయోధుడు, జాతిపిత మహాత్మాగాంధీని అవమాన పరుస్తూ పాల్వంచ నేషనల్ హైవేకు ఆనుకొని ఉన్న స్పైసీ హోటల్ యాజమాన్యం యదేశ్చగా మాంసాహారాన్ని విక్రయించారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం వరకు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ విచ్చల విడిగా మాంసం ఉత్పత్తులను అమ్మకాలు చేసింది. గురువారం రెండవ తేదీ గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం మద్యం, మాంసాహార విక్రయాలు నిషేధించినది. నిభంధనలు పాటించాలని కొత్తగూడెం కార్పోరేషన్ పాల్వంచ డివిజన్ అధికారులు పలు సామాజిక మాద్యమాలలో ప్రచారం చేశారు. విక్రయాలు చేసినచో జరిమానా విధిస్తామంటూ హెచ్చరికలను సైతం జారీ చేశారు. దీనితో పాల్వంచ మార్కెట్‌లోని పలు బిర్యానీ హోటల్స్, చికెన్, మాంసం, వైన్, బార్ షాపులను గురువారం స్వచ్ఛందంగా మూసివేశారు. కానీ ప్రభుత్వ నిభంధనలు మాకు పట్టవంటూ, ఆదేశాలు సామాన్యులకు మాత్రమే అంటూ స్థానిక స్పైసీ హోటల్ యాజమాని చికెన్, మటన్, ఫిష్, వగైరా బిర్యానీలను ఇష్టారీతిన అమ్మకాలు చేశారు. దీనితో పలు సామాజిక మాద్యమాలలో నిభంధనలు పాటించని హోటల్ యాజమాన్యం అంటూ వైరల్ అయింది. ప్రజల నుండి వచ్చిన వ్యతిరేకతతో చేసేదేమి లేకపోవటంతో సంభంధిత అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి రూ. 10,000/ల నామమాత్రపు జరిమానా విధించి వదిలేశారని తెలుస్తోంది. సామాన్య చికెన్ షాపు యాజమానులు ఎవరైనా చికెన్ విక్రయాలు చేసినచో భారీగా జరిమానా విధించే అధికారులు బడాబాబు పట్ల ఒకింత ఓదార్యం చూపెట్టారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పైసీ హోటల్ నిర్వాకంపై తగు విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలంటున్నారు.

# 300 వ్యాధులకు అద్భుతమైన సంజీవిని మన మునగ ఆకు..!



**ప్రజాపక్షం/మణుగూరుః** మునక్కాయలు నిత్యం మనం తినే ఆహారమే. అయితే మునక్కాయలే కాకుండా ఆకులోనూ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలున్నాయని పరిశోధనల్లో వెల్లడైంది. అసలు 4, 5వేల ఏళ్ల నుంచే మన పూర్వీకులు మునగాకును మెడిసిన్ తయారీలో వినియోగిస్తున్నారంటే ఆ ఆకు గొప్పతనం ఇట్టే అర్థమవుతుంది.ఆయుర్వేదంలో 300లకుపైగా వ్యాధులను నయం చేయడానికి ఈ మునగాకును ఉపయోగిస్తారు. అందుకే దీనిని సాంప్రదాయకైన మందుగానూ చెబుతుంటారు మన పెద్దలు.

**మునగాకులో ఉన్న అద్భుతమైన అద్భుతమైన ఔషధ గుణాలు...**

మునగాకుల్లో విటమిన్స్, ఎమినో యాసిడ్స్, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. క్యారెట్లు తింటే మాత్రమే వచ్చే విటమిన్ ఏ ని పదిరెట్లు అధికంగా మునగాకు ద్వారా పొందొచ్చు. కళ్ల వ్యాధులకు సంబంధించిన మెడిసిన్ లో మునగాకును వాడతారు. పాల నుంచి లభించే క్యాల్షియం 17 రెట్లు అధికంగా మునగాకు నుంచి వస్తుంది. పెరుగు నుంచి పొందే ప్రోటీన్లను 8 రెట్లు అధికంగా మునగాకు నుంచి పొందవచ్చు. అరటిపండ్ల నుంచి పొందే పొటాషియం 15 రెట్లు అధికంగా ఎండిన మునగాకు నుంచి పొందవచ్చు.

# హెచ్ కన్వన్షన్ హాల్‌కు అన్ని అనుమతులు ఉన్నాయి..

**- రూ. 17 కోట్ల భీమా సౌకర్యం కల్పించాం: నిర్వాహకులు**



**పజాపక్షం/పాల్వంచ :** హెచ్ కన్వన్షన్ హాల్ నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని యాజమాని ఎన్. సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్ లో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ...ఫంక్షన్ హాల్ నిర్మాణ స్థలంలో మొదటగా 2014 సంవత్సరంలో సంభంధిత ఇండస్ట్రియల్ శాఖ నుండి అన్ని అనుమతులు తీసుకొని బ్రిక్స్ ఫ్యాక్టరీ స్థాపించామన్నారు.రెండున్నర ఎకరాల భూమిని చిలుకూరి వీర భాస్కర్‌రెడ్డి వద్ద నుండి కొనుగోలు చేశామన్నారు. దీనికి తెలంగాణ పాస్ బుక్‌సైతం ఉందన్నారు. కాల క్రమేణ పరిస్థితుల ప్రభావంతో బ్రిక్స్ ఫ్యాక్టరీ తీసి వేశామని తర్వాత బార్ అండ్ రెస్టారెంట్ ప్లాన్ చేశామని అనుకోని పరిస్థితిలో దాన్ని క్యాన్సిల్ చేశామన్నారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని 2021లో మొదలు పెట్టామని చెప్పారు. 2022 రెవిన్యూ అధికారులు నాలా కన్వర్షన్ చేశామన్నారు. మున్సిపాలిటి నిభంధనల ప్రకారం మా హెచ్ కన్వన్షన్ ఫంక్షన్ హాల్‌కు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని తెలిపారు. మా వద్ద శుభకార్యాలు చేసుకొనే వారి భద్రతకు మేము మొదటి ప్రధాన్యతను ఇస్తామన్నారు. లాభాపేక్ష లేకుండా ప్రజల భద్రత కోసం సుమారు 17 కోట్ల రూపాయల భీమా సౌకర్యం కల్పించామన్నారు. ఇక్కడ అనుమతులు లేకుండా నిభంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి నిర్మాణాం చేయలేదన్నారు. మేము ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిభంధనల మేరకే ఫంక్షన్ హాల్ నిర్మాణం చేశామన్నారు. ఈ సమావేశంలో రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములకు అన్నదానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని రామన్నపేట కాలనీలో అయ్యప్ప మాల ధరించిన స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం రామన్నపేట కాలనీలో అయ్యప్పలు మాల ధరించారు. కాలనీలోని బొమ్మ స్వామి గుడిలో గొలుసుల తిరుమలరావు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఒకటవ డివిజన్ కైకొండాయిగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగటి ఉపేందర్ ఆధ్వర్యంలో మాల ధరించిన స్వాములకు అన్నదానం చేశారు. భక్తులు స్వామి నియమ నిబంధనలు పాటించి మాలధారణ పూర్తి చేసి దైవ దర్శనానికి వెళ్లి రావాలని ఆకాంక్షించారు.

# మెరిట్ విద్యార్థి రాహుల్‌దేవ్‌కి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/వైరాః** న్యూలిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌కి చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థి గుడిపూడి రాహుల్‌దేవ్ జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల, హైదరాబాద్‌లో ఉచిత సీటు సాధించడం విశేషం. ఈ ప్రతిభను గుర్తించి విద్యాభ్యాసంలో మరింత ముందుకు సాగాలని ప్రోత్సాహకంగా, గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. పుల్లారావు మార్గదర్శకత్వంలో డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ కోఆర్డినేటర్ లయన్ లగడపాటి ప్రభాకర్‌రావు ల్యాప్‌టాప్ కొరకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతుల మీదుగతా విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ కాపా మురళీకృష్ణ విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఇలాంటి సహాయాలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి, సమాజానికి కొత్త మార్గం చూపుతాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గంగవరపు కిషన్‌రాయ్, డిసి తోటకూర శ్రీకాంత్, వుయ్యూరు రామకృష్ణ, లాలు తదితరులు పాల్గొని విద్యార్థిని ఆశీర్వదించారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రావణ దహనం





**ప్రజాపక్షం/వైరాః** వైరా శ్రీషిరిడి సాయి మందిరంలో దసరా పర్వదినం సందర్భంగా దుర్గామాతకు జమ్మి చెట్టుకు భక్తులు సెమీ పూజలు ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మందిర కమిటీ నిర్వాహకులు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రావణ దహనం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ దసరా పర్వదినం రోజున దుర్గామాతకు పూజలు నిర్వహించి జమ్మి చెట్టుకు సెమీ పూజలు పాలపిట్ట దర్శనం నిర్వహించడం మంచి శుభపరిణామం అని అన్నారు. భక్తులందరికి మంచి శుభ ఫలితాలు అందాలని దుర్గామాత ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, క్లబ్ ప్రతినిధులు నంబూరు రామారావు, కమిటి నిర్వాహకులు పొడపాటి నాగేశ్వరరావు, లగడపాటి బోసు, క్లబ్ అధ్యక్షులు బుచ్చిరామారావు, మాదినేని సునీత భక్తులు పాల్గొన్నారు.

# మత్తులో అమ్మమ్మని కొట్టి చంపిన మనుమడు





**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల పరిధిలోని శకునవీడు గ్రామంలో శుక్రవారం మద్యం మత్తులో అమ్మమ్మని మనవడు తీవ్రంగా కొట్టి చంపిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శాఖముడి పద్మావతి(63) అనే వృద్ధురాలికి ఆమె కుమార్తె కొడుకు తల్లిదండ్రులు చనిపోవడంతో తన దగ్గరే ఉంటున్నాడు. మద్యం, గంజాయి బెట్టింగ్‌లకు బానిసైన మనవడు చీరాల సాయి తనను మందలించిన కారణంగా అమ్మమ్మను తలపై ఇనుపరాడ్‌తో తీవ్రంగా కొట్టడంతో రక్తస్రావం అయ్యి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైరా ఇన్‌చార్జి ఎసిపి రఘు, మధిర సిఐ మధు, ఎర్రుపాలెం ఎస్సై రమేష్ కుమార్‌లు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.